ఐదు రోజులుగా తాగునీరు బంద్ 2





నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత 2



AKSHARA TODAY


# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND


www.aksharatodaynews.com

11-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## అర్సపల్లి రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్‌జాంతో ఇబ్బందులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని అర్సపల్లి రైల్వేగేట్ వద్ద వద్ద ట్రాఫిక్ జాం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్మూర్ నుంచి శ్రీనగర్ గ్రామం, ఆకుల కొండూర్, జన్నేపల్లి రోడ్, బోధన్ రోడ్, నవీపేట్ నుంచి బాసర రోడ్ పనులను వెంటనే ప్రారంభిస్తే ట్రాఫిక్ సమస్యలు దూరమవుతాయని పలువురు కోరుతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు పనులు కాకపోవడంతో రైల్వేగేట్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ జాం ఏర్పడుతోందని బర్కర్‌పురా వాసులు అబ్దుల్ రషీద్ తదితరులు పేర్కొన్నారు.



## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు జెండా ఎగురవేసిన అనంతరం యెండల మాట్లాడారు. భారతీయులలో దేశభక్తిని, ఐక్యత శక్తిని పెంపొందించడం కోసం దేశ ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకోవాలని ఆయన పేర్కొన్నారు. దేశ విద్రోహశక్తులకు దేశభక్తితోనే సమాధానం చెప్పాలని ఆయన అన్నారు.

## చేయూత పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో చేయూత పెన్షన్ పథకం కింద కొత్త దరఖాస్తులను మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు స్వీకరించారు. ఒంటరి మహిళలు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు, గీత కార్మికులు అర్హత కలిగిన వారు అవసరమైన ధృవపత్రాలతో ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూపేందర్, శాల ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# యంగ్ ఇండియా స్కూల్ కలేనా!

■ జిల్లాలో మూడు నియోజకవర్గాలకు మంజూరు
■ ప్రారంభమైన పనులు.. వచ్చే ఏడాదికి ప్రవేశాలకు అవకాశం ■ కామారెడ్డి ఊసెత్తని ప్రభుత్వం

కామారెడ్డి జిల్లాలో మొత్తం నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. కామారెడ్డి మినహాయించి మిగతా మూడు నియోజకవర్గాలకు ప్రభుత్వం యంగ్ ఇండియా పాఠశాలలను మంజూరు చేసింది. పనులు కూడా మొదలయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరానికి ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కామారెడ్డిపై మాత్రం ప్రభుత్వం శీతకన్ను వేసిందన్న ప్రచారం సాగుతోంది. ప్రతి స్కూల్ 25 ఎకరాల్లో, 4 నుంచి 12వ తరగతి వరకు 2,560 మందితో ఉంటుంది. ఇందులో ఏఐ క్లాసులు, స్టెమ్ ల్యాబ్‌లు, క్రీడలు, హాస్టల్, ఆరోగ్య కేంద్రాలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 105 స్కూళ్లకు రూ.21 వేల కోట్లు కేటాయించారు.

### ఎమ్మెల్యేల పర్యవేక్షణ

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. తాజా జాబితా ప్రకారం జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు స్కూళ్లు మంజూరయ్యాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లింగంపేట మండలం మోతె గ్రామం, బాన్సువాడ నియోజకవర్గంలో పోతంగల్ మండలం రాంగంగానగర్, జుక్కల్ నియోజకవర్గంలో మద్నూర్ మండలంలో పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

### వచ్చే ఏడాది నుంచి తరగతులు

మంజూరైన మూడు చోట్ల భూమి గుర్తింపు, సరిహద్దుల నిర్ణయం పూర్తయ్యాయి. కొన్ని చోట్ల ప్రహరీ పనులు కూడా మొదలయ్యాయి. అధికారుల లెక్కల ప్రకారం నిర్మాణాలు వేగంగా సాగితే వచ్చే విద్యాసంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి ప్రవేశాలు చేపట్టే అవకాశం కూడా ఉంది. ఒక్కో పాఠశాలలో 2 వేలకు పైగా విద్యార్థులు ఉండనున్నారు.

### కామారెడ్డికి ఇస్తారా


కామారెడ్డికి మాత్రం యంగ్ ఇండియా స్కూల్ మంజూరు కాలేదు. ఈ అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులు ప్రకటన చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రానికి ఎందుకు అన్యాయం అంటూ పలు విద్యార్థి, యువజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. పూలే జయంతి రోజున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొని, వారం రోజుల్లో కామారెడ్డికి యంగ్ ఇండియా పాఠశాల మంజూరు అవుతుందని ప్రకటించారు. అయితే ఆ హామీ ఇచ్చి నెలలు దాటినా ఇప్పటికీ ఎలాంటి అతిగతి లేదు.

> **కామారెడ్డికి మంజూరు చేయాలి**
>
> జిల్లా కేంద్రంలో విద్యాసంస్థల ఏర్పాటుకు అనువైన స్థలం ఉంది. ఇప్పటికే జిల్లా కేంద్రానికి రావాల్సిన ఏటీసీ సెంటర్‌ను ఎలాంటి రవాణా సౌకర్యం లేని ప్రాంతంలో మంజూరు ఇచ్చారు. యంగ్ ఇండియా పాఠశాల కామారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
>
> – వినయ్ కుమార్, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు

## బాధ్యతగా పనిచేయకపోతే సరెండర్ చేస్తా: కలెక్టర్ భవేష్ మిశ్రా




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వ ఉద్యోగులు జీతం కోసం పనిచేయవద్దని.. వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత శాఖల ఉన్నతాధికారుకు సరెండ్ చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ లో జలసిరి, హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. ఎల్‌నినో వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న ప్రస్తుత తరుణంలో జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ నిర్మించాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా ఫాంపాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగని మండలాల ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిని సరెండర్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం జీతాల కోసం పని చేయకూడదని, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నీటి సంరక్షణకు ఉపయుక్తంగా నిలిచే ఫాంపాండ్స్, సోక్ పిట్స్ వంటి వాటిని విరివిగా నిర్మించేలా చూడాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయి నీరు అందించక వృథాగా ఉన్న బోరు బావుల వద్ద వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలు నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కలు నాటకుండా తప్పుడు నివేదికలు సమర్పించిన వారి నుంచి నిధుల రికవరీ చేపడతామని స్పష్టం చేశారు. . గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు లబ్ధిదారుల జాబితా రూపొందించాలన్నారు. అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రెయినీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఎగువన తగ్గిన వర్షాలు.. శ్రీరాంసాగర్‌కు తగ్గుతున్న వరద..

**అక్షరటుడే,మెండోరా:** శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమక్రమంగా తగ్గుతోంది. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు తగ్గడం.. జిల్లాలోనూ తగ్గుముఖం పట్టడంతో జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 3,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం ఉదయం 5వేలకు పైగా క్యుసెక్కుల వరద రాగా సాయంత్రానికి అది 3,430క్యూసెక్కులను పడిపోయింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,079.30 అడుగుల వద్ద 43.091 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1,079.60 అడుగుల వద్ద 43.968 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం నీటి నిల్వ సుమారు 0.88 టీఎంసీలు తక్కువగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 482 క్యూసెక్కులు నీళ్లు బయటకు వెళ్తున్నాయి. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## భయం భయంగా ప్రయాణం

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని పోచారం తండాకు వెళ్లే రోడ్డుపై మొరం మట్టి కూలుతుండటంతో ప్రయాణికులకు భయాందోళకు గురవుతున్నారు. ఇటీవల వర్షం పడటంతో జాతీయ రహదారి నుంచి పోచారం తండాకు వెళ్లే రోడ్డుపై మొరం కూలుతూ వస్తోంది. ఈ ఇరుకైన మార్గానికి ఇరువైపులా భారీ బండరాళ్లు సైతం ఉండడంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. మూడు రోజుల క్రితం బిచ్కుంద నుండి పోచారం తండాకు వచ్చే ఆర్టీసీ బస్సు ఈ మార్గం నుంచి వెళ్లాల్సి ఉండగా.. రోడ్డుకు అడ్డంగా బండరాళ్లు పడి ఉండడంతో విద్యార్థులు బండరాళ్లను తొలగించారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడను నిర్మించాలనితండావాసులు కోరుతున్నారు.

## తెయూలో రెడ్‌క్రాస్ సొసైటీ క్లబ్ సభ్యత్వ నమోదు




**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్లబ్‌ను ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. లక్ష్మణ చక్రవర్తి ప్రారంభించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు చేపట్టారు. విద్యార్థుల్లో మానవతా విలువలు, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్ నోడల్ అధికారి లావణ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ అపర్ణ, ప్రోగ్రామ్ అధికారులు అతీక్, మహమ్మద్ అలీ, శ్రీనివాస్, భ్రమరాంబిక పాల్గొన్నారు.

## జోరుగా కొనసాగిన 'హర్ ఘర్ తిరంగా' యాత్ర



**అక్షరటుడే, బాల్కొండ:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా అభియాన్-2026' సన్నాహక యాత్ర బాల్కొండలో మంగళవారం జోరుగా కొనసాగింది. బాల్కొండ మండల బీజేపీ ఆధ్వర్యంలో ఈ యాత్రను నిర్వహించారు. జిల్లా పరిషత్, శాంభవి, వెంకటేశ్వర, మదర్ థెరిసా, జ్యోతిరావు పూలే తదితర పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని పట్టణంలోని పలు వీధుల్లో దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు 'నేషన్ ఫస్ట్, పర్సన్ లాస్ట్' అనే స్ఫూర్తితో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు ముస్కు భూమేష్, లింగాగౌడ్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాలల విద్యార్థులకు బాల్కొండ మండల బీజేపీ అధ్యక్షుడు అంబటి నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సాయికిరణ్, నక్కల గణేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట చిన్నయ్య, బీజేవైఎం, కిసాన్ మోర్చా, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు సాయికార్తీక్, ఆరెపల్లి నర్సయ్య, కళ్లెం సుధాకర్, మండల ఉపాధ్యక్షులు బూసం సత్యనారాయణ, కాల రవి, కార్యదర్శులు కద్తల్ రాజేశ్వర్, ఐరా ప్రవీణ్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరినా.. నిధులు ఇవ్వడం లేదు : పోచారం



**అక్షరటుడే, ఇందూరు :** బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినా నిధులు ఇవ్వడం లేదన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం అనంతరం కాంగ్రెస్ గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ సలహాదారుగా సైతం నియమించింది. అయితే మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేసీఆర్ వల్లే అభివృద్ధి జరిగింది అని చెప్పారు. తాను కొన్ని రాజకీయ పరిణామాల వల్ల పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. నిధులు కావాలని రేవంత్ రెడ్డి తమ్ముడి దగ్గరికి తన కుమారుడిని పంపితే.. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు రూపాయి కూడా నిధులు ఇవ్వమని చెప్పి పంపించారన్నారు. దీంతో కొన్ని రోజుల తర్వాత తప్పక పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కండూవా కప్పుకున్నానని పోచారం తెలిపారు. అయినా నిధులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారన్నారు. నిధుల కోసం సీఎం రేవంత్ రెడ్డి ని కలిస్తే.. మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటికి తన ముందే చెప్పారన్నారు. మరుసటి రోజు వారికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాటలు మంత్రులు లెక్క చేయడం లేదన్నారు. మంత్రులకు చెప్పినా నిధులు ఇవ్వలేదని మళ్లీ సీఎంను కలిశానని పోచారం చెప్పారు. ఈ సారి వేం నరేందర్‌రెడ్డిని పిలిచి నిధులు విడుదల అయ్యేలా చూడాలని ఆయన చెప్పారన్నారు. తర్వాత రోజు వేం నరేందర్ రెడ్డి సైతం ఫోన్ లేపలేదని పేర్కొన్నారు. 50 సార్లు ఫోన్ చేసినా ఫోన్ అటెండ్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ధన్ పాల్ పరామర్శ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద ఇటీవల మృతి చెందిన యువకుడు అజీమ్ కుటుంబ సభ్యులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. ఆటో నగర్‌లోని వారి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఆసరాగా నిలిచిన యువకుడు మృతి చెందడం బాధాకరమన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద ఇరిగేషన్ శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం, లోతట్టు ప్రాంతాలకు అనుమతించకపోవడం చేయాలన్నారు. ఈ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అలాగే బాధిత కుటుంబాలకు తన వంతు సహకారం ఉంటుంది అన్నారు. కైసర్, నాగోల్ల లక్ష్మీ నారాయణ, బెల్లాల్ శశాంక్, రాము, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో మాక్ పోలింగ్.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ పదవుల కోసం బ్యాలెట్ పేపర్ విధానంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎంఈవో రాజులు మాట్లాడుతూ..ఓటు అనేది హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఈరోజు స్కూల్లో నేర్చుకున్నదే రేపు దేశాన్ని నడిపిస్తుందని తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం నిర్వహించిందని వివరించారు. ఈ మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులు భవిష్యత్ లో మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ గాంధీ మాట్లాడుతూ, పాఠశాలలో క్రమశిక్షణ, సేవా దృక్పథం ఉన్న విద్యార్థులను ఎన్నుకునేందుకే ఈ ఎన్నికలు పెట్టామని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా ఎన్నికల ప్రక్రియలో పాల్గొని సహకరించారు.

## పీఏసీఎస్ ముధోలి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని ముధెల్లి పీఏసీఎస్‌కు నూతన కార్యవర్గాన్ని కొలువుదీరింది. మంగళవారం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా దాసరి శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించగా, డైరెక్టర్లుగా గుండెల ప్రవీణ్ గౌడ్, కమ్మరి సంగమేష్, కుంటోల్ల లక్ష్మవ్వ, మదర్ కాశీం, ఎడ్ల బాలవ్వ, దొంతుల బోయిన బాలరాజ్, మహమ్మద్ శాబుద్దీన్, మోగుల సాయిరాం, బాల్గురి సుధాకర్, కేతావత్ దేవిసింగ్, సాయినేని లక్ష్మీ బాయి, బ్యాగారి కాశీరం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన ఛైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తమపై నమ్మకం ఉంచి పీఏసీఎస్ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ బండారి పరమేశ్, డీసీవో రామ్ మోహన్, క్లస్టర్ ఆఫీసర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.





# కనువిందు చేస్తోన్న పోచారం

■ పోటెత్తుతున్న పర్యాటకులు
■ 103ఏళ్ల చారిత్రక కట్టడాన్ని చూసేందుకు ఆసక్తి ■ భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు


**ఇటీవల కురుస్తున్న భారీ వర్షా లకు కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్ట్ పొంగిపొర్లుతోంది. ప్రాజెక్ట్ గేట్లపై నుంచి దూకుతున్న వరద, మత్తడిపై నుంచి జాలువారుతున్న జలపాతాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. స్థానికంగా 'తెలంగాణ నయాగరా'గా పేరుగాంచిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ఇతర జిల్లాల పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

హైదరాబాద్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో పర్యాటకులు కుటుంబ సమేతంగా వస్తున్నారు. ప్రాజెక్టుపై నుంచి కిందకు దూకుతున్న నీటిని, పక్కనే ఉన్న చిన్నపాటి జలపాతాల అందాలను సెల్ ఫోన్లలో బంధిస్తూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పోచారం అందాలు మరింత ఆకట్టుకునేలా ఉంటున్నాయి.

### పోలీసుల ప్రత్యేక చర్యలు..

వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు



ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్టు వద్దకు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను, హోంగార్డులను అప్రమత్తంగా ఉంచారు. సెల్ఫీల కోసం ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు.

### 103 ఏళ్ల చారిత్రక కట్టడం..

ఈ ప్రాజెక్టుకు ఎంతో చరిత్ర ఉంది. నిజాం ప్రభుత్వ హయాంలో 1917లో శంకుస్థాపన చేసి, 1922లో రూ.27 లక్షల వ్యయంతో నిర్మించారు. ఇది తెలంగాణలోనే మొదటి సాగునీటి ప్రాజెక్టు. మంచిప్ప వాగుపై 1.7 కి.మీ పొడవున నిర్మించిన ఈ ప్రాజెక్టు సామర్థ్యం 2.423 టీఎంసీలు కాగా.. పూడిక కారణంగా ప్రస్తుతం 1.82 టీఎంసీలకు నిల్వ సామర్థ్యం పడిపోయింది. దీని ద్వారా కామారెడ్డి, జిల్లాలోని సుమారు 10,500 ఎకరాలకు సాగునీరు అందుతోంది. గత ఏడాది ఈ ప్రాజెక్టు తన గరిష్ట వరద సామర్థ్యం 70 వేల క్యూసెక్కులకు రెండింతలకు పైగా అంటే 1.82 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకుని నిలబడి ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచింది.



## లయన్స్ భవనంలో ఉచిత వైద్య శిబిరాలు

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, డయాబెటిస్ వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య సమరయోధుల స్మరణ కోసమే..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాలను స్మరించుకునేందుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కల్పె అర్చన చిరంజీవి పేర్కొన్నారు. డివిజన్‌లోని తమ ఇంటిపై 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన యోధులను గుర్తు చేసుకుంటూ, ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేయాలన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

**అక్షరటుడే, ఆర్మూర్ :** వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ గౌడ్ అన్నారు. మన కాలనీ మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా మామిడిపల్లి సెంట్ పాల్స్ హైస్కూల్‌లో డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తం గా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగరంలో విషాదం.. ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ఆర్థిక ఇబ్బందులతో దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. నాల్గో టౌన్ ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. శేషాల నరేష్, మేఘన దంపతులను కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. నరేష్ విద్యుత్‌శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలున్నారు. మానసిక ఒత్తిడిలో ఉండడంతో నరేష్ కొన్నాళ్లుగా చికిత్స తీసుకుంటున్నాడు. అప్పులు పెరిగిపోవడం.. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లోనే మేఘన పురుగుల మందు తాగగా, నరేష్ ఉరి వేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న స్థానికులు వెంటనే వారిద్దరిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు నరేష్ ఇంట్లో సూసైడ్ నోట్ సైతం లభించింది. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, డిప్రెషన్ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వారు అందులో పేర్కొన్నారు.

## టీసీలివ్వకుండా వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి




**అక్షరటుడే,నిజామాబాద్ అర్బన్:** టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇంటర్మీడియట్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, నిజామాబాద్ జోనల్ కన్వీనర్ సందు ప్రవీణ్ మాట్లాడుతూ.. నగరంలోని గంగాస్థాన్ ప్రాంతంలో ఉన్న కళాశాలలతో పాటు మరికొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు ఫీజు బకాయిల పేరుతో టీసీలు, ఇతర విద్యా ధృవపత్రాలను ఇవ్వట్లేదన్నారు. దీంతో వారు పై చదువులకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సర్టిఫికెట్ ఇవ్వాలంటే రూ.200 అడుగుతున్నారని.. ఫీజులు కట్టలేదని సైతం సర్టిఫికెట్లు ఇవ్వట్లేదని ఆరోపించారు. జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల విషయంలో ఫైర్ సేఫ్టీ, మున్సిపల్ శాఖ, ప్రభుత్వ అనుమతులు లేకున్నప్పటికీ దర్జాగా ఫీజులు వసూలు చేస్తున్నారని.. అధికారులు తనిఖీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

## మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

**అక్షరటుడే, ఆర్మూర్:** మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘుతో కలిసి మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా, కౌన్సిలర్లు సడక్ వినోద్, భూపేందర్, నాయకులు గోనె దామోదర్, తాటి హన్మాండ్లు, శాల ప్రసాద్, గంగూలి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో సంత్ నాందేవ్ మహరాజ్ పుణ్యతిథి



**అక్షరటుడే, కోటగిరి :** మేరు కులస్తుల ఆరాధ్య దైవం సంత్ నాందేవ్ మహరాజ్ 676వ పుణ్యతిథి వేడుకలను పోతంగల్ మండలం దోమలేడ్గి విఠలేశ్వర మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి ప్రత్యేక భజనల అనంతరం ఉదయం కామప్ప మహారాజ్ ఆధ్వర్యంలో కీర్తన, భజనలు, జీవిత చరిత్ర ప్రవచనాలు వినిపించారు. మధ్యాహ్నం గులాల్, పల్లకీ సేవ చేశారు. మండల అధ్యక్షుడు, గట్ల రవీందర్ మాట్లాడుతూ.. పాండురంగ విఠలుని పరమ భక్తుడు సంత్ నాందేవ్ మహరాజ్ అన్నారు. కుల మతాలకతీతంగా, భక్తితత్వాన్ని చాటి చెప్పారని గుర్తు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెల్ల గంగాధర్, శ్రీధర్, మగ్దేవార్ రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత




**అక్షరటుడే, కామారెడ్డి:** నాగావళి ఎక్స్ ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న ఆరు కిలోల ఎండు గంజాయిని కామారెడ్డి ఎక్సైజ్, రైల్వే అధికారులు పట్టుకున్నారు. మంగళవారం నమ్మదగిన సమాచారం మేరకు సంబల్ పూర్ నుంచి నాందేడ్ వెళ్తున్న నాగావళి ఎక్స్ ప్రెస్‌లో కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ సిబ్బంది, రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రైల్వే బోగిలో 6 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. అయితే ఎండు గంజాయిని ఎవరు తరలిస్తున్నారనేది తెలియరాలేదని, నిందితుల కోసం గాలింపు కొనసాగుతుందని ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ సుందల్ సింగ్, ఎస్సైలు విక్రమ్ కుమార్, శ్రీనివాస్ రావు, శరత్ కుమార్, ట్రైనీ ఎస్సైలు అనిల్, మధు, సిబ్బంది అమృతరెడ్డి, శంకర్, పవన్, నర్సింలు, శరత్, రమేష్‌రాజు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో గుజ్జ రాజేశ్వరికి సన్మానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** చేనేత సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ఇటీవల గుజ్జ రాజేశ్వరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆమెను మంగళవారం ఫోరం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కాటిపల్లి నారాయణ రెడ్డి, కార్యదర్శి డా.వంగ విజయ కుమార్, కార్యవర్గ సభ్యులైన టి.భూమన్న, నల్లా రాజారెడ్డి, దొంతి లక్ష్మారెడ్డి, కర్ణం వెంకట రెడ్డి, శ్రీరాములు, లింగయ్య, భూమయ్య, రవీంద్రనాథ్, గుజరాతీ రాజేశ్వర్, రంగయ్య, సిద్దిరాములు, సత్యనారాయణ, సభ్యులు రాజన్న పాల్గొన్నారు.

